



# టాక్ షో కథలు

## - కిరణ్ ప్రభ

గత పది సంవత్సరాలుగా, ప్రపంచవ్యాప్తంగా ఉన్న లక్షలాదిమంది తెలుగువారిని అలరిస్తున్న కిరణ్ ప్రభ టాక్ షోలు, యు ట్యూబ్ లో 500 పైగా ఉన్న విషయం కౌముది పాఠకులకు తెలుసనే అనుకుంటున్నాము. కొంతమంది పాఠకులు ఆ టాక్ షోలకు అక్షరరూపం ఇస్తే బాగుంటుందని అడుగుతున్నారు. వారి సూచనలమేరకు ఆ టాక్ షోల నుంచి ఎంపికచేసిన కొన్నింటిని నెలనెలా ఇలా అక్షరరూపంలో మీకందిస్తున్నాము. ఈ టాక్ షోలను విని, వీటిని అక్షరీకరించిన వారు శ్రీ బొడ్డు సత్యనారాయణ(హైదరాబాదు). వారికి కృతజ్ఞతలు తెలియచేస్తూ, ఈ ప్రయోగం కౌముది పాఠకులకు నచ్చుతుందని ఆశిస్తున్నాము.

# దుర్గాబాయ్ దేశ్ ముఖ్

## మొదటి భాగం



ఈ రోజు ఒక విశిష్ట తెలుగు మహిళగురించి విశేషాలు తెలుసుకుందాం. ఈ విశిష్ట మహిళ సామాజిక సేవా రంగానికి చెందిన వ్యక్తి. 1900 సంవత్సరపు తొలిదశబ్దాలనుంచి ప్రారంభించి చూస్తే 20 వ శతాబ్దంలో సాంఘికసేవ అంటే ఈమె పేరే ప్రముఖంగా వినిపిస్తుంది. ఈ తెలుగు మహిళ ప్రత్యక్షంగా చేపట్టిన సోషల్ కార్యక్రమాలు ఎక్కువగా ఆంధ్రరాష్ట్రానికి పరిమితమైనా, భారత కేంద్ర ప్రభుత్వంలో కూడా కీలకమైన పదవిలో ఉండేవారు. ఆమె ప్రతిపాదించిన సాంఘిక సేవాకార్యక్రమాల వల్ల, ఆ కార్యక్రమాలు దేశమంతా విస్తరించినందువల్ల ఈమె పేరు భారతదేశమంతా తెలుసు. ఈ విశిష్ట తెలుగు మహిళని సామాజిక సేవా రంగంలో విప్లవ వనిత అని పిలవడంలో ఏమాత్రం సందేహం లేదని ఇదిగో నేను చెప్పబోయే విశేషాలు వింటే మీరందరు కూడా ఒప్పుకుంటారు. అకుంఠిత దీక్ష, రాజీపడని పోరాటమార్గం, పట్టుదల, ఆత్మవిశ్వాసం వీటన్నింటినీ మించి నిస్వార్థం , పరోపకారం ఈ విశిష్ట మహిళ యొక్క వ్యక్తిత్వంలో మనకి ప్రధానంగా కనిపించే లక్షణాలు. ఈమె సామాజిక సేవని వ్యవస్థీకృతం చేశారు. అంటే institutionalized social service. ముఖ్యంగా స్త్రీల, శిశువుల సంక్షేమ రంగాల్లో ఈ తెలుగు మహిళ చేసిన కృషి గత 70

సంవత్సరాలుగా లక్షలాది మంది మహిళలకి ఆత్మవిశ్వాసాన్ని ఇచ్చింది, ఉపాధి చూపించింది. అభాగినులు నిస్సహాయిలు అనేకమంది స్త్రీలకి కొత్త జీవితాన్ని ప్రసాదించింది ఇదిగో ఈ రోజు మనం మాట్లాడుకోబోతున్న మహిళ స్థాపించినటువంటి సంస్థలు,సామాజికసేవారంగంలో ఆవిడ సృష్టించినటువంటి విప్లవం. ఆమె స్థాపించి, పెంచి, పోషించిన సంస్థలు మరికొన్ని శతాబ్దాలకైనా అలాగే నిలిచి వెలుగుతాయి అనడంలో ఏమాత్రం సందేహంలేదు.

1909 లో జన్మించి 1981 లో మరణించిన ఈ ధీర వనిత కార్యక్షేత్రాలు కాకినాడ, మద్రాసు, హైదరాబాద్. ఈమె పుట్టింది రాజమండ్రిలో, పెరిగింది కాకినాడలో. చాలా ఆలశ్యంగా 43 సంవత్సరాల వయసులో పెళ్లిచేసుకున్నారు ఒక మహారాష్ట్ర ప్రముఖుడ్ని. చాలామందికి ఈమె తెలుగు వనిత అని తెలియకపోయినా ఆశ్చర్యపడాల్సిన పనిలేదు. ఎందుకంటే,ఈమె పేరులో మొదటి భాగం ఈమె పేరు, రెండవ భాగం ఆ మరాఠీ పేరు. భర్త నుంచి వచ్చింది ఉంటుంది. హైదరాబాద్ లో కొన్ని ప్రదేశాలకి ప్రముఖుల వ్యక్తుల పేర్లు ఉండడం మీకందరికీ తెలిసే ఉంటుంది. ఉస్మానియా యూనివర్సిటీ ని ఆనుకుని ఈమె పేరు తో ఒక కాలనీ కూడా ఉంది. ఆ ఉస్మానియా యూనివర్సిటీ నుంచి బర్కత్ పురా వైపు వెళుతుంటే, ద్యానగర్ లో ఈమె ప్రారంభించిన మహిళా కళాశాల,ఆసుపత్రి , అనుబంధసంస్థలు గత 50 , 60 సంవత్సరాలుగా ఆమె అకుంఠిత దీక్షకి, నిస్వార్థ సేవకి నిలువెత్తు నిదర్శనంగా నిలిచి , ఎంతోమంది మహిళలకి ఆపన్న హస్తాన్ని అందిస్తున్నాయి. ఈ రోజు వినూ శీర్షికలో మనం మాట్లాడుకోబోతున్న విశిష్ట తెలుగు మహిళ, సామాజిక విప్లవ వనిత, పరోపకారానికి ప్రత్యక్ష సాక్ష్యం, నిస్వార్థ సేవకు నిలువెత్తు నిదర్శనం దుర్గాబాయి దేశ్ ముఖ్ గా అందరికి తెలిసిన గుమ్మడిదల దుర్గాబాయమ్మగారు.

దుర్గాబాయమ్మగారి వ్యక్తిగత జీవితంలోనూ, సామాజికసేవాకార్యాక్రమాల్లోనూ, రాజకీయ ఉద్యమాల్లోనూ కూడా వంద సంవత్సరాల కిందట ఆవిడ చూపించిన లక్షణాలు – ఎన్ని ప్రతికూల పరిస్థితులలోనైనా తట్టుకోగల తెగువ, కొండలనైనా ఢీకొట్టగల సాహసం. ఆమె గంభీరమైన గొంతుతో పేరుపెట్టి పిలిస్తే ఎంతవారయినా సరే attention అన్నట్లుగా సమాధానమిచ్చేవాళ్లట. దుర్గాబాయిగారు స్థాపించిన సంస్థలూ, చేపట్టిన సాంఘిక సేవ కార్యక్రమాల జాబితా చెప్పాలంటే, ఒక అరా గంట పడుతుందండి! క్లుప్తంగా రాజమండ్రిలో ఆవిడ విగ్రహం కింద రాసినటువంటి వాక్యాలు కొన్ని చదువుతాను.

"పద్మ విభూషణ్ దుర్గాబాయి దేశ్ ముఖ్ స్వాతంత్ర్య పోరాటంలో వీర సైనికురాలు, పేరెన్నికగన్న న్యాయవాది, రాజ్యాంగసభలో ప్రముఖ వ్యక్తి, ఆంధ్ర మహిళా సభను సువర్ణాక్షరాలతో లిఖింపచేసిన సంఘ సంస్కర్త." ఇవి చాలండి! దుర్గాబాయి దేశ్ ముఖ్ గారి గురించి మనం చెప్పుకోడానికి.

నిజానికి ఈ ఆంధ్రమహిళా సభ, దాని అనుబంధ సంస్థలు – వీటికి ఊపిరి పోసింది దుర్గాబాయమ్మగారు. ఆమె ఏ నేపథ్యంలో ఇలాంటివి స్థాపించారో తెలిసికుంటే ఇంకా అంతకంటే ప్రేరణ, ఉత్తేజం, స్ఫూర్తి మరోటి కనిపించవు! దుర్గాబాయి దేశ్ ముఖ్ గారు చేసిన సేవలు, స్థాపించిన సంస్థలు చాలామందికి తెలుసు కానీ వ్యక్తిగత జీవితంలో ఆమె ఎదిగిన విధానం , ఆడవాళ్లు బయటికి రావడానికే భయపడేటటువంటి ఆ రోజుల్లో అంటే వంద సంవత్సరాల క్రిందట దుర్గాబాయమ్మగారు ధైర్యంతో ముందుకెళ్లిన విధానం, స్వతంత్రంగా ఉద్యమాలకు నాయకత్వం వహించిన లక్షణం ఇవన్నీ కూడా మరోసారి గుర్తుచేసుకోవడం ఈనాటి యొక్క కార్యక్రమం లోని ప్రధానమైన ఉద్దేశ్యం.

దుర్గాబాయి దేశ్ ముఖ్ గారి జీవితంలోని కష్టాలు, కన్నీళ్లు, బాధలు , బరువులు వీటికంటే – ధైర్యం,తెగువ,నిజాయితీ ఇవన్నీ కలబోసిన నాయకత్వ లక్షణాలు , ఆ నాయకత్వ లక్షణాలతో ఆవిడ శాశ్వతంగా చేసిన , శాశ్వతంగా ఉండేలా చేసిన సామాజిక సేవా సంస్థలు– ఇవీ ప్రముఖంగా కనిపిస్తాయి దుర్గాబాయి దేశ్ ముఖ్ గారి జీవితంలోంచి మనము గ్రహించాల్సిన ఉత్తమమైన లక్షణాలు. సామాజిక సేవ చేసిన వాళ్ళు తెలుగు వాళ్ళల్లో చరిత్రలో చాలామంది కనిపిస్తారు, మహిళలు కూడా కొంతమంది ఉండవచ్చు. కానీ, నూటికి నూరు శాతం నిస్వార్థంగా పనిచేసిన వాళ్లలో మొదటి పంక్తిలో పేర్కొనదగిన మహిళా దుర్గాబాయి దేశ్ ముఖ్ గారు. సామాజిక సేవంటే, ఏదో కొన్నాళ్ళు చందాలు వసూలు చెయ్యడం , కొంత మందికి సహాయం చేయడం కాకుండా ఆ చేసేటటువంటి కృషి,సేవ పదికాలాలు నిలవాలి అనే ముందు చూపుతో సంస్థలను స్థాపించి వాటికి స్వయం పోషకత్వాన్ని సమకూర్చే దిశలో ఆమె చేసిన సేవ దుర్గాబాయి దేశ్ ముఖ్ గారి ప్రత్యేకత.

కేవలం సామాజిక సేవలే కాకుండా, భారత రాజ్యాంగ నిర్మాణ సమితిలో కూడా ఆవిడ సభ్యురాలిగా ఉండి, ఆ తర్వాత ప్లానింగ్ కమిషన్ సభ్యురాలిగా ఉండి, అక్కడ్నుంచి దేశమంతా కూడా సాంఘిక సంక్షేమ కార్యక్రమాల దృష్ట్యా సంస్థలు స్థాపించాలి అని ప్రభుత్వాన్ని ఒప్పించి , దాన్ని

శాసనం చేయించి ఆ విధంగా భారతదేశమంతా క సాంఘిక, సంక్షేమ సంస్థలన్నింటిని స్థాపించి అనేకమందికి ఉపాధిని కల్పించారు. దుర్గాబాయి దేశ్ ముఖ్ గారి జీవితం లోని సంఘటనలను చూస్తుంటే, ఒళ్ళు గగుర్పొడుస్తుంది. ఒక్క మహిళ ఇన్ని సాధించిందా? అని ఆశ్చర్యం, ఆశ్చర్యాన్ని మించిన అనుభూతి కలుగుతుంది. ఇన్ని సంస్థలు నిలవాలంటే ఎంతో మంది పని చేయాలి కదా!మరి అందర్నీ కూడా కూడగట్టగల నాయకత్వ లక్షణాలు కూడా ఉండాలి కదా! అన్నింటిని అత్యంత సమర్థవంతంగా సాధించిన దుర్గాబాయి దేశ్ ముఖ్ గారు 24 సంవత్సరాల వరకు.. జాగ్రత్తగా వినండి! 24 సంవత్సరాల వరకు ఆవిడ స్కూలుకెళ్ళి చదువుకోలేదు. అంటే చాలా ఆశ్చర్యంగా ఉంటుంది కదా! అంతే కాకుండా 24 సంవత్సరాల వయసులో ఆవిడ చదువుకోడం ప్రారంభించి మరొక ఏడెనిమిది సంవత్సరాల్లో అంటే 32 ,33 సంవత్సరాల వయసు వచ్చేసరికి ఆవిడ క్రిమినల్ లాయర్ గా కోర్ట్ లో అడుగు పెట్టారు. క్రిమినల్ లాయరే ఎందుకయ్యారు? అంటే – ఆమె జీవితంలో ఉన్న ప్రేరణకి , ఉత్తేజానికి స్ఫూర్తియే ఇదొక చిన్న ఉదాహరణ.

చిన్నప్పట్నుంచి కూడా దుర్గాబాయమ్మగారు ఎక్కడా ఏ సవాల్ ఎదురైనప్పటికి దాన్ని అవకాశంగా మలుచుకొని ఉద్యమాలు నిర్వహిస్తూ వెళ్లారు. ఇది చాలా తక్కువమంది జీవితాల్లో కనిపిస్తుంటుంది. వంద సంవత్సరాల క్రిందట మహిళల పరిస్థితి గురించి వేరే చెప్పాల్సిన అవసరం లేదు.కనీసం చదువు సంగతి మర్చిపోండి. ఇంట్లో నుంచి బయటికి రావడానికి కూడా పెద్దవాళ్ళు అనుమతించేవాళ్ళు కాదు. సమాజం కూడా అనుమతించేది కాదు. అలాంటి రోజులలో దుర్గాబాయి దేశ్ ముఖ్ గారు చేసిన ఈ సేవలన్నింటికీ, ప్రతిదీ ఆమెకొక సవాల్ గా వచ్చినప్పుడు దాన్ని సాధించుకుంటూ వెళ్లారు. పదకొండు, పన్నెండు సంవత్సరాల వయసులో హిందీ పాఠశాల పెట్టి దానికి ప్రిన్సిపాల్ అయ్యారు. నమ్మగలమా అండి? వంద సంవత్సరాల కిందట పన్నెండు సంవత్సరాల బాలిక హిందీ చెప్పేటటువంటి స్కూలుని పెట్టి, దానికావిడ ప్రిన్సిపాల్ అయ్యారు. పైగా అది వందేళ్ల కిందట. దానికి విశేషమైన ఆదరణ కూడా లభించింది. ఇలాంటివి దుర్గాబాయమ్మ గారికి మాత్రమే సాధ్యమైంది ఆ రోజుల్లో. రాజకీయ సత్యాగ్రహాల్లో జైలుకి వెళ్ళినప్పుడు అక్కడ మహిళా ఖైదీల దయనీయమైన పరిస్థితుల్ని చూసి "క్రిమినల్ లాయర్ అయితే బావుంటుంది, ఇలాంటి మహిళలు చాలామంది తమ బాధలు చెప్పుకోలేకపోతున్నారు. అదేగనక మహిళా క్రిమినల్ లాయర్ ఉంటే గనక వాళ్ళు తమ బాధల్ని , వాస్తవాల్ని ధైర్యంగా చెప్పుకోగలరు" అనే ఆలోచనతో ఆవిడ జైలు నుంచి విడుదలయ్యాక చదువుకోవడం ప్రారంభించి క్రిమినల్ లాయరయ్యారు. స్త్రీ శిశు సంక్షేమ సేవా సంస్థలు కూడా ఎలా వచ్చాయంటే – ఒకదాని తర్వాత ఒకటి ఆవిడేదో ఒక పని మొదలుపెట్టడం, దాన్నుంచి ఏదో ఒక సమస్య రావడం ఆ సమస్యని పరిష్కరించుకోవడం కోసం మరొక సంస్థ దాన్నుంచి మరొక సమస్య, ఆ సమస్యని పరిష్కరించడం కోసం మరొక సంస్థ ఇలాగా ఈ సంస్థలన్నింటినీ విస్తరిస్తూ వెళ్లారు. ఈ సంస్థలే ఈ రోజు శాఖోపశాఖలుగా విస్తరించి ఎంతో మంది మహిళల జీవితాల్లో వెలుగులు నింపాయి, నింపుతున్నాయి, నింపుతూ ఉంటాయి కూడాను. మరొక్క లక్షణం చెప్పి ఆవిడ జీవిత విశేషాల్లోకి వెళతాను. నిస్వార్థం అంటే దుర్గాబాయమ్మగారే. ఆమె స్థాపించిన సంస్థలు ఎవరికైనా అప్పుజెప్పడానికి ఆవిడకు సంతానమే లేదు.కనీసం బంధువులెవరికి కూడా వాటిల్లో ప్రధానమైన పదవుల్లో లేరు. ఇదొక్కటి చాలు కదండీ!ఆవిడ నిస్వార్థతకి నిదర్శనం. దుర్గాబాయమ్మగారు చిన్న వయసునుంచి కూడా ఏది చేసినా ఒకటే ఆలోచన "ఎదుటవాళ్ళకి ఎలా సహాయపడాలి?" అని. అలా మొదలైన పరోపకారం , సామాజికసేవ ఇలాంటివన్నీకూడా కేవలం దుర్గాబాయమ్మ గారి దగ్గరినుంచి మొదలవ్వలేదు. వాళ్ళ వంశంలోనే ఇది ఒక విధంగా రక్తంలో ప్రవహిస్తూ వచ్చింది అని చెప్పుకోవచ్చు. అణువణువునా ఆశ్చర్యం, ఉత్తేజం , స్ఫూర్తి , ప్రేరణ కలిగిస్తాయి దుర్గాబాయి దేశ్ ముఖ్ గారి గుమ్మడిదల దుర్గాబాయమ్మగారి జీవిత విశేషాలు. అవి తెలుసుకోడానికి వాళ్ళ తాతగారి దగ్గర ప్రారంభిద్దాం.

దుర్గాబాయమ్మగారి తాతగారు, అంటే వాళ్ళ అమ్మగారి నాన్నగారిది రాజమండ్రి.,ఆయన పేరు మనోహరం పంతులు గారు. వీరు పోలీస్ ఇన్స్పెక్టర్ గా ప్రారంభించి, బ్రిటిష్ రాజ్యంలో 1860-70 ప్రాంతాల్లో సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ అయ్యారు. ఆ ఉన్నత పదవిని స్వీకరించిన మొట్టమొదటి తెలుగు వ్యక్తో లేకపోతే మొట్టమొదటి కొద్దీ మంది లోనో ఈ మనోహరం పంతులుగారు ఒకరు ఆంటారు. రాజమండ్రి లో ఆ రోజుల్లోనే వీరేశలింగం పంతులుగారు విప్లవాత్మకమైన సేవా కార్యక్రమాలను చేపట్టారు. మనోహరం పంతులు గారు వీరేశలింగం పంతులు గారికి చాలా ఆత్మీయమై మిత్రులే అవ్వడమే కాకుండా ఆయన గవర్నమెంట్ పదవిలో ఉన్నప్పటికీ వీరేశలింగం పంతులు గారు చేసే సేవ కార్యక్రమాల్లో ఆయన పాలు పంచుకుంటూ ఉండేవాళ్ళు. వీరేశలింగం పంతులు గారి జీవిత చరిత్ర ఎప్పుడైనా చదువుతుంటే తరచు ఈ మనోహరం పంతులు గారి పేరు వినిపిస్తూ ఉంటుంది. ఆ మనోహరం పంతులుగారి అమ్మాయి కృష్ణవేణమ్మ. కృష్ణవేణమ్మ గారికి, ఆమె భర్త బెన్నూరి రామారావు గారికి కలిగినటువంటి మొదటి సంతానం దుర్గాబాయమ్మగారు. దుర్గాబాయమ్మ గారికి ఒక తమ్ముడు కూడా ఉన్నారు, ఆయన పేరు నారాయణ రావు గారు. వీళ్ళ చిన్న వయసులో

రామారావు గారు కాకినాడ లో కోర్ట్ లో పనిచేస్తూ ఉండేవాళ్ళు. కోర్ట్ లో పనిచేయడమే కాకుండా కాకినాడలో చాలా సాహసోపేతమైనటువంటి సామాజిక సేవా కార్యక్రమాలు చేశారు. సాహసోపేతమైన సామాజిక సేవ అంటే – ఆ రోజుల్లో ప్లేగు, కలరా ఇలాంటి వ్యాధులు ఎక్కువగా ఉండేవి.వాటికి మందులు కూడా లేవు. అందువల్ల అవి వచ్చినవి అంటే గనక కొన్ని వందలాదిమంది చనిపోతూ ఉండేవాళ్ళు. అలా చనిపోయేవాళ్ళకి, వాళ్ళ శవాలు తీసికెళ్ళడం, జబ్బు చేసిన వాళ్లకి సేవ చేయడానికి కానీ ఎప్పుడూ ఎవరూ బయటికి వెళ్ళడానికి సాహసించేవాళ్ళు కాదు. అంతే కాదు ఈ ప్లేగు, కలరా ఇలాంటివి వచ్చినపుడు ఎవరైనా చనిపోతే , ఆ శవాన్ని స్మశానానికి తీసికెళ్ళడానికి కూడా ఎవరూ ముందుకెళ్ళేవాళ్ళు కాదు. ఆ రోజుల్లో రామారావు గారు ధైర్యంగా నలుగురు, ఐదుగురు మిత్రులు కొంతమందిని తీసుకొని బయటికి వెళ్లి ధైర్యంగా ఈ కలరా , ప్లేగు వచ్చినవాళ్లందరికి కూడా సేవలు చెయ్యడము , చనిపోయిన వాళ్ళ యొక్క శవాలను ఆయనే బండిమీద వేసుకొని స్మశానానికి వాటికి తీసికెళ్ళడమూ ఇలాంటి పనులు చేస్తూ ఉండేవాళ్ళు. అదే రోజుల్లో ఇలాంటి పనులు చేసినటువంటి ఒక మహోత్కృష్టమైన వ్యక్తి ఒకాయన ఉన్నారండి. ఆయన పేరు సుభాష్ చంద్రబోస్. కటక్ లో అయన కూడా ఇలాంటి సేవే చేశారు.ఆ తర్వాత సుభాష్ చంద్ర బోస్ గారి జీవితమంతా వేరొక చరిత్ర అనుకోండి! పోలిక కాబట్టి చెప్పాను. రామారావు గారు ఒక్కడే కాకుండా అలాంటి పనులు చేసేటప్పుడు ఆయన భార్య కృష్ణవేణమ్మ గారిని చిన్నపిల్లలు దుర్గాబాయమ్మ గారిని ఆమె తమ్ముడు నారాయణరావు గారిని వాళ్ళ ముగ్గుర్ని తీసికెళ్ళేవాడట. దహనం చేసేటప్పుడు స్మశానానికి కూడా తీసికెళ్ళడం, అలాగే చర్చికి, మసీదుకి కూడా వెళ్లి అక్కడ ఎలాంటి ప్రార్థనలు చేస్తారు? ఇలాంటివి చూపించడం, పిల్లలు భయపడతారని అనుకోకుండా. అంటే, జీవితం ఎంత అశాశ్వితమైనది , ఈ అశాశ్వితమైన జీవితంలో ఏం చేస్తే మనం పదికాలాలపాటు నిలుస్తాం, మనం నిలవడమే కాదు, సమాన జీవితానికి ఒక అర్థం కల్పించుకోవాలంటే పరులకి ఎలా సేవచేయాలి ఇలాంటివన్నీ కూడా రామారావుగారు చిన్నపిల్లలకి అంత చిన్న వయసులోనే ప్రత్యక్షంగా చూపించారు.అలా పెరిగారు దుర్గాబాయమ్మగారు.

అంత చిన్న వయసులో స్మశానానికి వెళ్ళినపుడు ఆవిడకి భయం వేయలేదు సరి కదా ఆవిడ ధైర్యాన్ని మరింత చేసింది వాళ్ళ నాన్నగారు చేసినటువంటి ఇలాంటి కార్యక్రమాలన్నీ. దుర్గాబాయమ్మగారు సహజంగానే ఆ రోజుల్లో చాలా చిన్న వయసులోనే స్కూల్ కి వెళుతూ ఉండేవాళ్ళు. ఆవిడ 8 సంవత్సరాల వయసులో ఆవిడకు వివాహం చేశారు. అది కూడా ఎలాగంటే – సుబ్బారావు గారని ఒకాయన దగ్గర్లో ఉన్న జమిందార్ గారెవరికో పిల్లలు లేకపోతే, సుబ్బారావు గారిని పెంచుకున్నారు. ఆయనకిచ్చి వివాహం చేశారు దుర్గాబాయమ్మగారికి 8 సంవత్సరాల వయసు ఉండగా. ఆ తర్వాత దుర్గాబాయమ్మ గారికి ఊహ వచ్చి, ఆవిడ మిగతా కార్యక్రమాల్లోకి వెళ్లడం మొదలుబెట్టాక వాళ్ళ నాన్నగారికి చెప్పారు "నాన్నా నీవు పెళ్ళైతే చేసావు కానీ వివాహమంటే ఏమిటో తెలియని రోజుల్లో చేశావు నేను ఈ వివాహాన్ని ఒప్పుకోలేను. జీవితాన్ని నేను ఇలా ఇప్పుడే భర్తకంకితమై పోయి ఇంట్లో ఉండలేను అందువల్ల నేను సుబ్బారావు గారికి చెబుతాను ధైర్యంగా నేను వెళ్లి , నేనిలాగా మీతో కాపురం చేయలేను మీరు కావాలంటే వేరే వివాహం చేసుకోండి అని చెబుతాను" అని వాళ్ళ నాన్న గారికి చెప్పింది. వాళ్ళ నాన్నగారు మరీ మొండికేసే మనిషి కూడా కాదు . కాకపోతే అప్పటి ఆ ఆచారాలను బట్టి 8 సంవత్సరాల వయసులో పెళ్లి చేశారు గాని కూతురు తన 15 ఏళ్ళ వయసులో ధైర్యంగా చెప్పినప్పుడు ఆయన కూడా కాదనలేదు. ఆ 15 ఏళ్ళ వయసులో దుర్గాబాయమ్మ గారు ఎప్పుడో వివాహమైన భర్త దగ్గరికి వెళ్లి ధైర్యంగా చెప్పారు. "నేను మీతో కాపురాన్ని కొనసాగించలేను నా జీవితం యొక్క పరమార్థం వేరు, నా సామాజిక సేవ వీటిల్లో ఎక్కువ గా ఉంటాను అందువల్ల మీతో వివాహం నేను విచ్ఛిన్నం చేసుకుంటాను. కావాలంటే మీకు పేపర్ రాసి ఇస్తాను మీరు వేరే వివాహం ఎప్పుడైనా చేసుకోండి" అని. . ఇంకా బలవంతం చేసి కాపురానికి తెచ్చుకున్నాఉపయోగమేముంది అనుకున్నారేమో కానీ ఆయన కూడా దుర్గాబాయమ్మ గారు చెప్పినటువంటి ఆ విషయాన్ని ఆమోదించి , ఆయన వేరే వివాహం చేసుకున్నారు ఆ వేరే వివాహం చేసుకునేటప్పుడు కూడా పెద్దవాళ్ళందరూ అడిగారట. " ఆ దుర్గాబాయమ్మ గారి దగ్గర పేపర్ రాయించుకో. నా కేమీ సంబంధం లేదు. నేను ఒప్పుకుంటున్నాను" అని చెబితే ఆయన ఆ మాటడిగితే దుర్గాబాయమ్మ గారు కాగితం కూడా రాసి ఇచ్చారు. తర్వాత ఏమైందంటే,దుర్గాబాయమ్మ గారు ఇందాక చెప్పుకున్నటువంటి సామాజిక సేవలు , ఆంధ్రమహిళాసభ వాటి అనుబంధసంస్థలు అవన్నీ ఇన్ని దశాబ్దాల దాకా ఉండటం అవన్నీ ఒక ఎత్తండీ! ఆవిడ వ్యక్తిగత జీవితంలో కూడా మహోన్నతమైనటువంటి వ్యక్తిత్వాన్ని ప్రదర్శించారు. సుబ్బారావు గారు వివాహం చేసుకున్నాక ఆయన కూడా చిన్న వయసులోనే మరణించారు. అప్పటికి దుర్గాబాయమ్మ గారు ఈ సేవలు చేయడం, సంస్థలు స్థాపించడం ఇవన్నీ కూడా జరిగినవి 1940 ప్రాంతాల్లో. అప్పటికి దుర్గాబాయమ్మ గారికి 32 ,33 సంవత్సరాల వయసు. సుబ్బారావు గారు అతని భార్యకు చెప్పారట "చూడూ నీవు ఒక్క దానివే ఉంటేగనక బంధువులందరూ మోసం చేస్తారు నువ్వు దుర్గాబాయమ్మ గారి దగ్గరకు వేళ్ళు ఆమె నిన్ను చేరదీస్తుంది అని" అప్పుడు ఆమె దుర్గాబాయమ్మ గారి దగ్గరకు వచ్చారు. చూడండి ఎంత విచిత్రమో!

చిన్నతనం లో బాల్యవివాహం చేసుకొని వద్దన్నటువంటి భర్త చేసుకున్న మరొక అమ్మాయి నిస్సహాయంగా తన దగ్గరికి వస్తే ఆవిడ్ని ఆదరించి,తాము స్థాపించినటువంటి సంస్థల్లో ఆవిడక్కూడా శిక్షణ ఇప్పించి జీవితాంతం తన దగ్గరే ఉంచుకున్నారు దుర్గాబాయమ్మగారు. అదండీ! ఆవిడ వ్యక్తిత్వం. ఇదొక్కటే కాదు ఆవిడ వ్యక్తిగత జీవితంలో ఆ తర్వాత జరిగినటువంటి రెండు మూడు సంఘటనలు కూడా చూస్తే, ఆవిడ వ్యక్తి గానూ,సంస్థగానూ కూడా తరతరాలకి స్ఫూర్తి నందించే తెలుగు మహిళా తేజం అనడంలో ఏమాత్రం సందేహం లేదు.

అయితే వాళ్ళ నాన్నగారు 36 సంవత్సరాల వయసులోనే చనిపోయారు. వాళ్ళమ్మగారికి చెప్పారు "నేను చాలా తప్పు పని చేశాను,దుర్గాబాయమ్మకి చిన్నతనంలో వివాహం చేసి . ఆమె జీవితాన్ని నేను అటూ ఇటూ కాకుండా చేశాను. ఆవిడ ఎప్పుడు పెళ్లి చేసుకుంటానంటే అప్పుడు నువ్వు పెళ్లి చెయ్యి" అని. ఇవన్నీ ఆవిడ వ్యక్తిగత జీవితంలో చిన్నప్పుడే జరిగిన కొన్ని సంఘటనలు.

దుర్గాబాయమ్మగారి బాల్యంలో జరిగిన మరో సంఘటన – ఆ రోజుల్లో మహాత్మాగాంధీ గారు భారతదేశ స్వాతంత్ర్య ఉద్యమాన్ని చాలా తీవ్రమైన స్థాయికి తీసుకు వెళ్ళడానికి ప్రయత్నాలు చేస్తూ. భారతదేశమంతా పర్యటిస్తున్నారు. ఆ పర్యటించే క్రమంలో స్వాతంత్రోద్యమానికి కావాల్సిన విరాళాలు సేకరించడం చేస్తూ ఉండేవాళ్ళు. మహాత్మా గాంధీ గారు రాజమండ్రి వస్తున్నారు అని చిన్నపిల్లయినటువంటి దుర్గాబాయమ్మ గార్ని తీసుకుని (11 ఏళ్ళ వయసామెకి ) వాళ్ళ నాన్న గారు రాజమండ్రి వెళ్లారు. ఆ సభలో మహాత్మా గాంధీ గారికి అందరూ విరాళాలు ఇవ్వడమూ, అలాగే వంటిమీదున్నటువంటి ఆభరణాలివ్వడం ఇలాంటి వన్నీ చేస్తున్నారు. అంత చిన్న వయసులోనే దుర్గాబాయమ్మ గారు ఆ పక్కనున్న వాళ్ళ గాంధీ టోపీ తీసుకుని ఆ టోపీ తో అందరి దగ్గరి నుంచి విరాళాలు తీసికొని గాంధీ గారికిచ్చారట. మొదటి సారిగా ఈ దేశ స్వాతంత్ర్యం గురించి మహాత్మా గాంధీ గారు చేస్తున్నటువంటి ఆ పోరాటం గురించి 11 ఏళ్ళ వయసులోనే దుర్గాబాయమ్మ గారికి ఆ విధంగా పరిచయం కలిగింది.

ఆ తర్వాత ఆవిడ కాకినాడ వచ్చేశాక ఏమనుకున్నారో ఏమిటో కానీ స్కూల్లో చెప్పే ఇంగ్లీష్ చదువు నచ్చలేదు. పైగా ఆ రోజుల్లో మహాత్మ గాంధీ గారు – హిందీ గనక అందరికీ తెలిస్తే దేశవ్యాప్తంగా అందరికీ కమ్యూనికేషన్ బావుంటుంది , అలాగే భాషా, ఈ వ్యత్యాసాలు లేకుండా ఉంటుంది స్వాతంత్ర్య ఉద్యమం కూడా ఎక్కువగా ప్రచారం చేయడానికి వీలవుతుంది అని మహాత్మా గాంధీ గారు హిందీ ని నేర్చుకోమని ఎక్కువగా ప్రచారం చేస్తున్నారు. అది కూడా ఒకటి కలిసొచ్చిందేమో దుర్గాబాయమ్మ గారికి స్కూల్ మానేసి హిందీ నేర్చుకోవడానికని కాకినాడలోనే దినవహి సత్యనారాయణ అనే ఒకాయన హిందీ నేర్పుతూ ఉంటె, ఆయన దగ్గరికెళ్లి ప్రైవేట్ గా హిందీ నేర్చుకోవడం ప్రారంభించారు. హిందీ నేర్చుకుంటేనే రోజంతా గడిపారంటే లేదు.ఆ చిన్న వయసులోనే ఆవిడకి ఈ చుట్టుపక్కలున్న వాళ్ళను పరిశీలించడం, సమాజం లో ఉన్నటువంటి ఈ సమస్యలు వీటన్నింటిని కూడా తెలుసుకోవడం కూడా ఆసక్తికరంగా ఉండేవి. ఆవిడకి 12 సంవత్సరాల వయసులో 1921 లో మహాత్మ గాంధీ గారు కాకినాడ వచ్చారు. .ఆ రావడానికి ముందు ఏం జరిగిందంటే – దుర్గాబాయమ్మగారు గమనించినటువంటి విషయం ఏమిటంటే, ఈ బహిరంగ సభలకి కొంత మంది ఆడవాళ్లు వెళ్లలేక పోతున్నారు (వితంతంతువులైనవాళ్లు, ముస్లిం ఆడవాళ్లు, ఈ వేశ్యా వృత్తిలో ఉన్న దేవదాసీలు) .కానీ మహాత్మ గాంధీ గారి యొక్క సభకి వీళ్ళందరూ కూడా వెళ్ళాలి, కేవలం స్వాతంత్రోద్యమానికి వీళ్ళు ఊతమివ్వడమే కాకుండా వీళ్ళ జీవితాల్లో కూడా మార్పులు రావాలి. మనం ఇంట్లోనే ఉంటున్నాము బయటికెళ్ళడం లేదు. మనకి కూడా చైతన్యం కావాలి అనే ఆలోచన వీరిక్కూడా రావాలి అంటే మహాత్మా గాంధీ గారి ఉపన్యాసాన్ని వీరు వినాలి అని అంత చిన్న వయసులో అనుకున్నారండి ఆవిడ. సభకి ఎలాగూ వీళ్లందరినీ రానివ్వరు , వీళ్ళు వెళ్ళలేరు అందుకని ఈ మహిళలకోసం ప్రత్యేకంగా ఒక సభ పెట్టి అక్కడికి మహాత్మా గాంధీ గారిని ఆహ్వానించాలని. ఎంత ధైర్యం ..12 ఏళ్ళ పిల్ల.! పైగా ఆవిడేదో హిందీ నేర్చుకుంటుంది. స్కూల్ కి వెళ్లడం లేదు. కానీ ఆ వయసులోనే ఏమైనాసరే సాధించాలి అని. మహాత్మా గాంధీ గారి సభ కోసం ప్రయత్నాలు చేసే పెద్దవాళ్ళ దగ్గరికెళ్లి (బులుసు సాంబమూర్తి అలాంటి వాళ్ళందరూ ఉన్నారు) "ఏమండీ! మీ దగ్గరికి, మహాత్మా గాంధీ గారు వస్తారు కదా ఆ ముందుగానో, తర్వాతనో ఒక్క ఐదు నిమిషాలు మా దగ్గరికి పంపించండి నేను కొంతమంది మహిళలందరిని చేరదీస్తాను వాళ్ళ దగ్గరకొచ్చి ఆయన ప్రత్యేకంగా ఉపన్యాసం ఇవ్వాలి" అని అడిగింది. ఆయన ఆశ్చర్యపోయారు. "ఇంత చిన్న పిల్లవి నువ్వేమిటి? సభ పెట్టడమేమిటి ? ఎవరో ఆడవాళ్లను తీసుకురావడమేమిటి? ఓ పని చెయ్యి..ఐదువేల రూపాయలు నువ్వెక్కడైనా చందాలు వసూలు చేసుకోగలిగి మహాత్మా గాంధీ గారికి ఈ స్వాతంత్రోద్యమ నిధికి ఇవ్వగలిగితే నీ సభకు పంపించేటటువంటి ఆలోచన చేస్తాను" అని ఆయన చెప్పారు.

ఎవరైతే మహిళల్ని ఈమె చైతన్య పరుస్తుందో వాళ్ళదగ్గరికెళ్ళి "మనం ఐదు వెలిస్తే మహాత్మా గాంధీ గారు మన సభకు కూడా వస్తారు.విడిగా సభ పెట్టుకుందాం.మహాత్మా గాంధీ గారు మనకోసం ప్రత్యేకంగా మాట్లాడుతార"ని చెప్పింది. వాళ్ళందరూ కలిసి ఐదు వేల రూపాయలు ఎలాగైతేనేం సమకూర్చారు. మళ్ళీ సభని ఏర్పాట్లు ఎవరు చేస్తున్నారో వాళ్ళదగ్గరికెళ్ళి ఐదువేలు సమకూర్చాను.అని చెప్పింది. వాళ్ళు ఆశ్చర్యపోయారు. ఏదో ఆ మాట చెపితే మానేస్తుంది కదా అన్నారు. చివరికి వాళ్ళేమన్నారంటే సరే ఐదువేలయితే సమకూర్చావు బాగానే వుంది కానీ మహాత్మా గాంధీ గారు వేరే సభకు రావడమంటే చాలా ఈ రక్షక భటులు ఇవన్నీ కూడా ఉంటాయి.ఓ పని చెయ్యి ఐదు వేలు కూడా తీసుకొచ్చి నువ్వే ఈ సభలో ఇచ్చేసెయ్యి కావాలంటే నిన్ను వేదిక ఎక్కిస్తామని చెప్పారు. ఆవిడ పట్టు వదల్లేదు " అలా కాదండీ.. మీరు ఐదు వెలిస్తే పంపిస్తామన్నారు మళ్ళా మాట తప్పొద్దు ఎలాగైనా సరే నేను సభ పెడతాను మా సభలోనే మహాత్మా గాంధీ గారికి ఐదువేలిస్తాను" అని వాళ్ళనెలాగైతే ఒప్పించింది. వాళ్ళేమన్నారంటే "సరే అయితే నువ్వు సభ ఎక్కడ పెడతావో నిర్ణయించుకో.. అప్పుడు ఆలోచిద్దాం" అన్నారు.

అక్కడ్నుంచి వచ్చి ఆవిడ శివయ్యశాస్త్రి గారు, ఒకప్పుడు ఆమె చదువుకుని మానేసినటు స్కూలు హెడ్ మాస్టారు, ఆయన దగ్గరికెళ్ళి " మాష్టారు మరి మహాత్మా గాంధీ గారిని ఒక ఐదు నిమిషాలు ఒక సభకి పిలుద్దామనుకుంటున్నాము. బహిరంగ సభకి వెళ్లలేనటువంటి మహిళలందరూ వస్తారు వాళ్లందరినీ నేను కూడగట్టాను. ఐదువేల రూపాయలు విరాళాలు సేకరించాను. నాకు సభకి ప్రదేశమేదైనా కావాలి మీ స్కూలు ఆవరణ ఇస్తారా?" అని అడిగింది. ఆయన వెంటనే ఒప్పుకున్నారు. ఇంకో మాట కూడా చెప్పింది దుర్గాబాయమ్మ గారు. "చూడండి మాష్టారు మరి బ్రిటిష్ వాళ్ళందరూ కూడా నిఘా పెడుతున్నారు మహాత్మా గాంధీ గారికి సహాయం చేసేవాళ్ళమీద, మరి ఈ సభకి మీరు ప్రవేశమిస్తే తర్వాత మీకేమైనా ఇబ్బందులొస్తాయేమో" అని. ఆయన" అమ్మా 12 ఏళ్ళ పిల్లవు నువ్వే ధైర్యంగా సభ పెడుతుంటే ఇంత పెద్దవాణ్ణి నేను భయపడ్తమా?" అని అన్నారు.

మొత్తానికి ఎలాగైతే ఎవరైతే బహిరంగ సభకి వెళ్ళలేరో వేశ్యలు, దేవదాసీలు, ముస్లిం మహిళలు ఇలాంటి వాళ్లందరినీ కూడా చేరదీసి ఆ దుర్గాబాయమ్మ గారు ఆ ఆవరణలో సభ కి ఏర్పాట్లు చేశారు. ఐదువేల రూపాయలు ఎలాగూ ఆవిడ విరాళాలు వసూలుచేసి ఉంచారు.మరి మహాత్మా గాంధీ గారు రావడమెలాగా? ఆయన మామూలుగా మాట్లాడేటటువంటి పెద్ద సభేమో టౌన్ హాల్ లో. కాకినాడ రైల్వే స్టేషన్ నుంచి టౌన్ హాల్ కి వెళ్ళేటటువంటి దోవలోనే ఈ దుర్గాబాయమ్మ గారు ఏర్పాటు చేసినటువంటి సభ ఉంది. పెద్ద వాళ్ళు ఏమనుకున్నారంటే సరే ఇన్ని ఏర్పాట్లు చేసుకుంది కదా చిన్న పిల్ల మనం చెప్పినవన్నీ చేసింది. ఐదు నిమిషాలు కాదమ్మా కనీసం రెండు మూడు నిమిషాల కంటే ఎక్కువ ఉండరు కేవలం వేదిక ఎక్కుతారు నువ్వు ఐదువేలిచ్చేసెయ్యి వెళ్ళిపోతారని చెప్పేశారు. అలాగే కానివ్వండి అందావిడ. మొత్తానికి ఎలాగైతే ఆ రోజు రానేవచ్చింది.

1921 ఏప్రిల్ 2 , ఆ రోజున మహాత్మా గాంధీ గారు టౌన్ హాల్ కి వెళ్తూ మధ్యలో దుర్గాబాయమ్మ గారు ఏర్పాటు చేసిన సభలో వేదికెక్కారు. వేదికెక్కగానే ఇంకొక పెద్దమనిషి నెవరినో తీసికొని వెళ్లి ఐదువేల రూపాయలు ఆయనకీ విరాళంగా ఇచ్చారు. అంతే కాకుండా అక్కడున్నటువంటి మిగతా ఆడవాళ్లు కూడా వాళ్ళ యొక్క ఆభరణాలు ఇవ్వడం ప్రారంభించారు. మహాత్మాగాంధీ గారికి చాలా ఆశ్చర్యమేసింది. విరాళాలు సమర్పించడం అయిపోయాక గాంధీఆరు మాట్లాడ్డం ప్రారంభించారు. ముందుగా ఐదు నిమిషాలు మాత్రమే మాట్లాడుతానని చెప్పారు. ఐదు నిమిషాలయింది, పది నిమిషాలయింది, పదిహేను నిమిషాలయింది. ముప్పై నిమిషాలయింది ఆయన ఆపటం లేదు. ఆయన మరి హిందీ లో మాట్లాడుతున్నారు.మరి వీళ్లకు తెలుగు కదా ఎలా అర్థమౌతుంది?ఇదిగో అప్పుడే హిందీ నేర్చుకుంటున్నారు కదా దుర్గాబాయమ్మ గారు ఆవిడకేదో వచ్చినటువంటి కొంచెం హిందీతో ఆయన మాట్లాడినటువంటి మాటలన్నిటిని కూడా తెలుగులో చెప్పడం ప్రారంభించారు. ఆ విధంగా ఆ రోజు గంట పైగా సాగింది దుర్గాబాయమ్మ అనేటటువంటి 12 ఏళ్ళ బాలిక ఏర్పాటు చేసినటువంటి ఆ ప్రత్యేకమైన సభ. ఆ సభ అయిపోయి వెళ్ళేటప్పుడు మహాత్మాగాంధీ గారు "దుర్గా" అని పిలిచారట ఈవిడ్ని. తన కారెక్కమన్నారు. ఆ కారులో మహాత్మాగాంధీ భార్య కస్తూరిబాగాంధీ గారున్నారు. ఆవిడ పక్కన కూర్చోబెట్టుకుని టౌన్ హాల్ కి కూడా దుర్గాబాయి గారిని తీసికెళ్ళారు. ఆయనక్కడ మాట్లాడ్డం ప్రారంభించాక – ఆయన ఉపన్యాసాన్ని తెలుగు లో చెబుతోంది కొండా వెంకటప్పయ్య పంతులు గారని ఆయన ఆయన్ని పిలిచి "చూడు ఈ దుర్గ ఇందాక బాగా ట్రాన్సిలేట్ చేసింది. అందుకని ఈ అమ్మాయి చెబుతుందిలే" అని కొండా వెంకటప్పయ్య పంతులు గారిని కూడా పక్కన కూర్చుండమని చెప్పి దుర్గాబాయికే ఆయన ఉపన్యాసాన్ని తెలుగులో చెప్పేటటువంటి అవకాశాన్ని ఇచ్చారు మహాత్మాగాంధీ గారు.

అది మొదలు, మహాత్మాగాంధీ గారు దక్షిణ భారతదేశానికి ఎప్పుడొచ్చినా తెలుగు దేశంలోనూ, మద్రాస్ లోనూ కూడా చాలా చోట్ల దుర్గాబాయి గారే ఆయన హిందీ ప్రసంగాన్ని తెలుగులోనూ, వచ్చీ రానటువంటి తమిళం లోనూ కూడా చెప్తూ ఉన్నారట. ఇలాంటి కొన్ని కొన్ని సంఘటనలు వింటూ ఉంటె యేవో ఫెయిరీ టైల్స్ లాఅనిపిస్తూ ఉంటుంది కానీ ఈ విశేషాలన్నిటికీ కూడా చరిత్రలో చక్కటి రుజువులున్నాయండి. అంతే కాకుండా ఇప్పుడు నేను మీకు చెప్తున్న విషయాలన్నింటిని కూడా దుర్గాబాయి దేశముఖ్ గారు స్వయంగా ఆవిడ యొక్క ఆత్మకథలో రాసుకున్నారు. చింతామణ్ అండ్ ఐ అనే పుస్తకం రాశారు. 1977 లో ఆవిడ స్వయంగా రాసిన ఆత్మకథలో చెప్పిన విషయాలు ఇవన్నీను. ఆ విధంగా దుర్గాబాయిగారి నాయకత్వ లక్షణాలు అంత చిన్నవయసులోనే పదిమందికీ తెలిశాయి. అంత చిన్న వయసునుంచే ఆవిడకి ఈ సమాజం గురించి ఆలోచించడం,సమాజంలో అన్యాయమై పోతున్నటువంటి మహిళల గురించి ఆలోచించడం వాళ్లకి ఏమైనా చేయాలనుకోవడం ప్రారంభమైంది.

1921 లో ఈ సంఘటన జరిగాక ఈవిడ హిందీ నేర్చుకుంటూనే ఉన్నారు, సత్యనారాయణ గారి దగ్గర. ఆ తర్వాత 2 సంవత్సరాలకి 1923 లో కాకినాడ లో ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ సదస్సు జరిగింది. ఆ సదస్సుకు పక్కనే హిందీ సమ్మేళన్ అనే ఇంకొక సదస్సు కూడా పెట్టారు. మహాత్మాగాంధీ గారు అప్పటికే హిందీ ప్రచార సభలు అనే సంస్థలను ప్రారంభించారు. అంటే, ఒక పద్ధతి ప్రకారం హిందీ అందరికీ బోధించడానికని కొన్ని కొన్నిపరీక్షలు పెట్టి, ఆ పరీక్షల లో ఉత్తీర్ణులైన వారికి సర్టిఫికెట్లనివ్వడం ప్రారంభించారు. అలాంటి హిందీ ప్రచార సభలు రాజమండ్రిలో ఒకటి ప్రారంభించినప్పుడు ఆ ప్రచార సభ ద్వారా పుస్తకాలు అవి తెచ్చుకొని ఒక పద్ధతి ప్రకారం ఎలా చదవాలని నేర్చుకొని, ఈవిడ నేర్చుకోవడమే కాకుండా పక్క వాళ్లకి చెప్పడం ప్రారంభించారు. ఆ పక్కవాళ్ళకు చెప్పడం ఎంతవరకు వెళ్లిందంటే, వాళ్ళ ఇంట్లోనే వాళ్ళ అమ్మగారు, నాన్న గారు ఒక రెండు గదులిచ్చి "సరే నీ దగ్గరికి ఇంతమంది నేర్చుకోడానికి వస్తున్నారు కదా ఈ రెండు గదుల్లోనూ నీవు చెప్పుకో" అని దుర్గాబాయమ్మ గారికి చెప్పారు. ఆవిడ వయసు 13 ,14 సంవత్సరాలు మాత్రమే.పైగా ఆవిడ అందరికి హిందీ నేర్పడంఒక కారణం కూడా ఉంది. 1923 లో జరుగబోయేటటువంటి నేషనల్ కాంగ్రెస్ సదస్సుకి , హిందీ సమ్మేళన్ కి వాలంటీర్లు కావాలి. అక్కడకు వచ్చేవాళ్ళందరూ కేంద్రం నుండి వచ్చేవాళ్ళు. ఉత్తర భారతదేశం నుంచి వచ్చినవాళ్లు. వాళ్లందరికీ హిందీ తెలిసిన వాలంటీర్లు కావాలి. ఆ ఉద్దేశం తో కూడా దుర్గాబాయి దేశముఖ్ గారు తన యొక్క 14 సంవత్సరాల వయసులో వాళ్ళ ఇంట్లోనే బాలికా హిందీ పాఠశాల అనే ఒక స్కూలు ని ప్రారంభించారు. కేవలం హిందీ నే కాకుండా దేశభక్తి గీతాలు, ఆటలు, పాటలు వీటితో కలిపి హిందీ చెప్పడం తోటి ఈవిడ స్కూలు కి ఎక్కువమంది వస్తుండేవాళ్ళు. ఆమెకు నేర్పించే హిందీ మాస్టారు తర్వాత అన్నారట "నువ్వు నా దగ్గర నేర్చుకొని వెళ్ళావు, నా దగ్గర ఉన్న స్టూడెంట్స్ అందరూ నీ దగ్గరికి వచ్చేస్తున్నారు దుర్గా" అని. ఆమె దాదాపుగా 400 ,500 మందికి హిందీ లో ఆవిడ తర్ఫీదు ఇచ్చారు. వాళ్ళందరూ కూడా 1923 లో కాకినాడ లో జరిగినటువంటి ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ కి వాలంటీర్లు గా సిద్ధమయ్యారు. వాళ్లందరినైతే ఆవిడ సిద్ధం చేశారు కానీ ఈవిడకు మాత్రం వాలంటీర్ గా ఇవ్వలేదు ఎందుకంటే,ఈవిడ వయసు 14 సంవత్సరాలు మాత్రమే ఈవిడ దగ్గర శిక్షణ పొందిన వాళ్ళందరూ మాత్రం వాలంటీర్లుగా వెళ్లారు. కొంతమందిని ఏంచేశారంటే, "మీరు ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పక్కన జరుగుతున్నటువంటి ఎగ్జిబిషన్ లో మీరు వాలంటీర్లు గా ఉండొచ్చు" అని. అంటే ఎవరైతే కాంగ్రెస్ సభకి వాలంటీర్లు గా పొందలేదో వాళ్ళందరినీ ఎగ్జిబిషన్ దగ్గర వాలంటీర్లు గా పెట్టారు.

ఎంట్రన్స్ ఈ టిక్కెట్లు తీసుకోవడం లోపలికి పంపించడం వాటన్నింటికని దుర్గాబాయమ్మ గారిని నియమించారు. 14 సంవత్సరాల వయసు , హిందీ ధారాళంగా మాట్లాడుతున్నారప్పటికీ. ఆవిడ గేట్ దగ్గరుండగా ఒక పెద్దమనిషొచ్చారు లోపలికెళ్లడానికి. ఆవిడ టిక్కెట్ అడిగింది. ఆయన టిక్కెట్ లేదన్నారు. "రెండు అణాలౌతుంది. కావాలంటే కొనుక్కోండి" అని చెప్పింది.ఆయన దగ్గర రెండు అణాలు కూడా లేదు అన్నారు. "అయితే నువ్వు వెళ్ళడానికి లేదు" అని ఆపేసింది సంవత్సరాల దుర్గాబాయమ్మ. ఆ చుట్టుపక్కనున్న వాళ్ళందరూ గబా గబా పరిగెత్తుకుని వచ్చారు "అమ్మా! తెలుసా? ఎవ్వరినంటున్నావు నువ్వు" అని. "ఆయన జవహర్లాల్ నెహ్రూ అని నాకు తెలుసు. ఎవరైనా అవ్వనివ్వండి నేను పద్ధతి ప్రకారం చేస్తున్నాను. నాకు చెప్పిన రూలు ఇది. ఎవరైనా టిక్కెటుంటేనే వెళ్ళమన్నారు.ఆయనకు టిక్కెట్ లేదు కాబట్టి నేను ఆపేశాను" అని. జవహర్ లాల్ నెహ్రూ గారు కూడా ఆ చిన్న పిల్లను అభినందించి "నువ్వు మంచి పని చేశావు. నీ బాధ్యతను నీవు నిర్వర్తించావు" అని దుర్గాబాయమ్మ గారిని మెచ్చుకున్నారు. భవిష్యత్తులో ఆ తర్వాత పాతిక సంవత్సరాలకి జవహర్ లాల్ నెహ్రూగారి నాయకత్వంలో ఆవిడ కేంద్ర ప్రభుత్వంలో ఉన్నత పదవులు అలంకరిస్తారని, ఆమె ద్వారా దేశవ్యాప్తంగా సాంఘిక సేవా సంస్థలు వెలుస్తాయని జవహర్ లాల్ నెహ్రూ గారు అనుకోలేదు.

ఆ తర్వాత రోజుల్లో ఈమె ప్రముఖ వ్యక్తయి రాజకీయాల్లోకి వెళ్ళాక జవహర్ లాల్ నెహ్రు గారి కుటుంబానికి చాలా సన్నిహితంగా ఉన్నారు. ఇందిరా గాంధీ గారు కూడా చాలాసార్లు చెప్పారు "సామాజిక సేవలో నాకు స్ఫూర్తి దుర్గాబాయి దేశముఖ్ గారు" అని.

ఆ తర్వాత ఈ బాలికా హిందీ పాఠశాల ఏమైందంటే,క్రమక్రమంగా ఎక్కువమంది రావడం ప్రారంభించారు. వాళ్ళ నాన్నగారు ఇంట్లో ఇచ్చినటువంటి రెండు గదులు కూడా సరిపోలేదు. ఆ పక్కనున్నటువంటి ఎవరో ఇల్లు ఖాళీగా ఉంటే వాళ్ళ ఇంట్లో నడుపుకోవమ్మా అని ఇచ్చారు. అక్కడ్నుంచి ఆ ఇంటికి వెళ్ళింది ఆ బాలికా హిందీ పాఠశాల. అప్పటికే చాలామంది వస్తున్నారు.ఈ స్కూలు కి కూడా చాలా పేరొచ్చింది. ఈ క్రమం లో ఏమైందంటే దుర్గాబాయమ్మ గారి అమ్మగారు కృష్ణవేణమ్మ గారు ఆవిడ కూడా కూతురుతో కలిసి నేర్చుకోవడం ప్రారంభించారు.ఆవిడ తమ్ముడు కూడాను వాళ్ళమ్మగారు కూడా ఎంతగా నేర్చుకున్నారంటే – ఆవిడ కూడా మాధ్యమిక, ప్రాథమిక పరీక్షలు పాస్ అయ్యారు.

దుర్గాబాయమ్మ గారి జీవితంలో వాళ్ళమ్మగారు కృష్ణవేణమ్మ గారి పాత్ర కూడా ఎంతో ప్రముఖంగా ఉంది. అది కూడా చెప్పుకుందాం తర్వాత

ఆ విధంగా 1923 లో ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ అయ్యిందగ్గర్నుంచి నాలుగైదు సంవత్సరాల్లో వాళ్ళు ప్రారంభించిన బాలికా హిందీ పాఠశాల వందలాది మందికి హిందీ నేర్పడం, కొనసాగించింది. అలాగే కాకినాడకి రాజకీయ నాయకులు ఎవరొచ్చినా , ఇక్కడేదో హిందీ నేర్పుతున్నారట అని ఆ స్కూలు కి రావడం తీరా అక్కడికొచ్చి చూస్తేనేమో చిన్నపిల్ల 14 , 15 ఏళ్ళ అమ్మాయి . ఈ అమ్మాయి ఇంత పని చేస్తుందా అని వాళ్ళందరూ మెచ్చుకోవడం అది ఒక టాక్ అఫ్ ది టౌన్ గా ఉండింది ఆరోజుల్లో. 1929 లో వాళ్ళ నాన్నగారు చనిపోయారు. ఆయనకప్పుడు కేవలం 36 సంవత్సరాల వయసు. ఆ చనిపోయేటప్పుడు ఇందాక చెప్పుకున్నాం కదా, భార్యతో చెప్పారు "చూడూ.. అమ్మాయికి అన్యాయం చేశాను మళ్ళీ ఎప్పుడు పెళ్లి చేసుకుంటానంటే అప్పుడు పెళ్లి చెయ్యి" అని.

అక్కడనుంచి దుర్గాబాయమ్మ గారి జీవితం లో ప్రధాన మలుపుకి దారితీసిన మరొక సంఘటన, ఆ సంఘటన తర్వాత మరికొన్ని సంఘటనలు జరిగినవి. వీటన్నింటినీ కూడా భాగంలో తెలుసుకుందాం.

**(ఆడియో టాక్ షో కి అక్షరరూపం ఇచ్చినవారు – శ్రీ బొడ్డు సత్యనారాయణ)**

(సశేషం)

★★★

2017 ఫిబ్రవరి 28 న ప్రసారమైన ఈ టాక్ షోని ఇక్కడ వినవచ్చు

COMMENTS